

# షాంపూ కథ

డా॥డి.ఎ.సత్యనారాయణ

పిన్ని ఇంటి ముందు ఎద్దుల బండి నుంచి దిగగానే కమలను చుట్టుపక్కల ఆడవాళ్ళు చుట్టుముట్టారు. కమల పట్టణంలోని ఒక చిన్న ఆఫీసులో టైపిస్ట్. ఉద్యోగంలో చేరిన కొద్ది రోజులకే ఆమె ముసలి తల్లి చనిపోయింది. ఆమె ఒంటరిది అయింది. అందువల్లే దూరంగా వున్నా, ఆమె పిన్నిని చూడడానికి ఆ పల్లెటూరుకు తరుచుగా వస్తూపోతూ వుంటుంది. ఆమె వచ్చినప్పుడల్లా టౌన్ నుండి ఏదో ఒక క్రొత్త వస్తువు తీసుకురావడం, దాని చుట్టూ ఆ పల్లెటూరి ఆడంగులు మూగడం పరిపాటి. ఈ సారి టైం లేక కాస్త హడావుడిగా బయలుదేరడంతో ఆమె వెంట ఏమీ తీసుకురాలేదు. కుశల ప్రశ్నలు అయేక అదే విషయం వారితో చెప్పింది. అయినా ఆడవాళ్ళు ఆమెను వదలలేదు. ప్రయాణం చేసి ఇంటికి రాగానే కమలకి తలస్నానం చేయడం అలవాటు.

"కుంకుడు కాయలు కొట్టి వుంచనా?" కమల పిన్ని అడిగింది.

"వద్దు పిన్నీ!"..."వస్తూ షాంపూ బాటిల్ తెచ్చాను...మీ ఊరి కాయలు ఎన్నికొట్టి పోసుకున్నా నురుగు సరిగా రాదు ... అందుకని ......" చెప్పింది కమల.

"చాంపూనా?" "అదేంటేంటి?" వెళ్ళిపోతున్న ఆడవాళ్ళు ఆగి కుతూహలంగా అడిగారు.

ఇక తప్పదు. అన్నట్లు బ్యాగ్‌లో వున్న బాటిల్ తీసి చూపించి వాడే విధానం చెప్పింది. అయినా కమల స్నానం పూర్తి అయేవరకు ఒక్కరు కూడా ఆమెను విడువలేదు. కమల స్నానం చేసేటప్పుడు వచ్చే నురగను చూచి, ఎప్పుడైనా పని మీద మగవాళ్ళు పట్నం వెళ్ళినప్పుడు తామూ అలాంటి సీసా ఒకటి తెప్పించు కోవాలనుకున్నారు మనసులోనే అందరు.

* * *

ఆఫీసులో వర్క్ ఎక్కువగా వుండి, శలవు లేనందున కమల పిన్నిగారి ఊరికి వెళ్ళి మూడు నెలలు కావస్తోంది. ఒక రోజు తీరిక చేసుకొని బయల్దేరింది. ఇంటికి చేరేటప్పటికి ఆ ఊరి ఆడవాళ్ళంతా అరుగుల మీదే కూర్చొని బాతాఖానీ కొడుతున్నారు. ఈసారి వాళ్ళు కమలను ఆప్యాయంగా పలకరించలేదు, సరికదా కోపంగా ముఖం చిట్లించి చూడసాగారు. కమలకి ఏమీ అర్థంకాలేదు. అదే విషయం అడిగింది పిన్నిని, ఆమె చేతిలోని మజ్జిగ సీసా తీసుకుంటూ. వాళ్ళ పిన్ని ఆమెతో ఏదో చెప్పబోయేలోగా చేతులలో సీసాలతో గుంపుగా ఆడవాళ్ళంతా లోపలికి వచ్చారు.

"ఏమమ్మో... "భలే సీసాలే తెప్పిచ్చావే మాతో... నురగా దీని పాడా! థూ... నెత్తిన పోసుకోగానే జిడ్డే జిడ్డు... అదేమి జిడ్డబ్బా...మాగెడు కుంకుడు నీళ్ళోసుకున్నా వదల్లేదు. ...భలే దానివేనే..." మూతి విరుస్తూ ఆడంగులంతా ఒక్కసారిగా కమలపై దండెత్తారు. క్షణం బిత్తరపోయింది కమల. వాళ్ళ చేతులలోని సీసాలలో ఒకటి తీసుకొని పరీక్షగా చూచింది. నవ్వాగలేదు కమలకి. పడి పడి నవ్వింది. ఆడంగులంతా ఆమెను పిచ్చిదానిగా చూడసాగారు. అతి కష్టం మీద నవ్వాపుకుంటూ చెప్పింది.

"ఇది షాంపూ సీసాలు కావు వదినగారు!" హెయిర్- ఆయిల్ సీసాలివి!" ...మరలా బిగ్గరగా నవ్వింది.

"హేలాలా? అదేంటెంకొకటి? ఉక్రోషంగా పలికారంత మంది.

"ఇవి కొబ్బరి నూనె...ఆముదం లాగా తలకి వాడుకొనేవి."

"మాకేం తెల్సు... మా ఊరోడొకడు పట్నం బయల్దేరుతా వుంటేనూ, తలా పది రూపాయలిచ్చి, "తలకు పోసుకొనేది" తెమ్మంటే, ఆ సచ్చినోడు ఇవి తెచ్చాడు...సగం సీసాడు నెత్తిన పోసుకున్నా... నురగ లేకుంటే......

"బహుశా" తలకి పోసుకొనేది" అని అడిగితే "తలకి పూసుకొనేది" అనుకొని షాపువాడు ఇవి ఇచ్చి వుంటాడు"...బలవంతంగా నవ్వును ఆపుకోవాలని ప్రయత్నించి విఫలమైంది కమల. ●

## కన్నె విరులారా......

చెన్నుగా వెన్నుదుట హిమబిందు
ముత్యాలతో
వెన్నంటి సుధలాను భృంగముల హేలతో
కుసుమ పరాగ సుగంధ సౌరభాలతో
అరవిరిసిన సిరులతో మురిపింప చేసే
కన్నె విరులారా మీరు కదలి రండి
భావి కాలానికి పూలబాట వేయండి

-డి.ఆర్. మోహన్